క్లుప్తంగా

నేడు గజరాయునివలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామ సచివాలయ కన్వీనర్ మూడడ్ల భాస్కరరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

తహసీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



స్పందన కార్యక్రమంలో తహసీల్దారుపై ఫిర్యాదు చేస్తున్న మోహనరావు

రేగిడి: మండల తహసీల్దారుగా పనిచేసి, వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన టి.కల్యాణచక్రవర్తిపై ఇదే మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన సమతా సైనిక్ దళ్ ఇన్‌చార్జ్ తేగల మోహనరావు సోమవారం జరిగిన జిల్లా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బూరాడ దళితవాడలో ఉన్న 67వ సర్వే నంబరులో 5 సెంట్ల ప్రభుత్వ భూమిని ఇదే గ్రామానికి చెందిన కొంతమంది అన్యాక్రాంతం చేస్తుండగా, అప్పటి తహసీల్దారుగా ఇక్కడున్న కల్యాణచక్రవర్తి వారికి సహకరించారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని తప్పుడు రికార్డులతో పట్టాలు సృష్టించి, అన్యాక్రాంతం చేసిన వారికి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు రికార్డులు పుట్టించిన తహసీల్దారుతో పాటు అన్యాక్రాంతానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌డీవో



ఎమ్మెల్యే శంబంగికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడను ఆర్‌డీవో సాయిశ్రీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. బొబ్బిలి ఆర్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారిగా ఎమ్మెల్యేను కలవగా, రెవెన్యూ సేవలు విస్తతం చేయాలని ఆర్‌డీవోను ఎమ్మెల్యే కోరారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

మెంటాడ: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన కాసేపు మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో రూ.230 కోట్లతో సంక్షేమ పథకాల అమలు, రూ.176 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. అంతకుముందు వ్యవసాయం, విద్యుత్, గృహనిర్మాణ, స్త్రీ,మాతా శిశు సంక్షేమ, వెలుగు, ఉపాధి, విద్య, పశుసంవర్ధక శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు, ఎంపీడీవో త్రివిక్రమ్, తహసీల్దారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

రాజాం సిటీ: స్థానిక ఆర్‌టీసీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను ఆర్‌టీసీ ఈడీ సి.రవికుమార్, ఈఈ కె.వెంకటరాజు సోమవారం పరిశీలించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రూ.1.80 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో బస్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోందని ఈడీ తెలిపారు.

ఓటుహక్కు నమోదుపై అవగాహన

రాజాం సిటీ: ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించాలని తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమైన ఆయన 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటుహక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బాడంగి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో తహసీల్దారు అజురఫీజాన్ సోమవారం సమావేశమై, కచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలు సేకరించే బీఎల్‌వోలకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

రాజాం: మండలంలోని బొద్దాం, పెనుబాక, మారేడుబాక తదితర గ్రామాల్లో ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ముసాయిదా ఓటరు జాబితా ఆధారంగా ఓటర్ల వివరాలు సరి చూశారు. అలాగే కొత్త వారి నుంచి ఓటుహక్కు దరఖాస్తులు స్వీకరించారు.

వంగర: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో తహసీల్దారు బి.సుందరరావు సోమవారం సమావేశమై, పక్కాగా ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు.

ప్రజాసంకల్పయాత్రతో సుపరిపాలనకు నాంది

ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వాడవాడలా జరిగిన విజయోత్సవ సభలు, సమావేశాల్లో కేక్ కటింగ్ చేసి, యాత్ర కొనసాగిన తీరును నేతలు గుర్తుచేసుకున్నారు. 2017 నవంబరు 6న ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన యాత్ర 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర నిర్విరామంగా సాగిందన్నారు. యాత్ర ద్వారా తెలుసుకున్న ప్రజల సమస్యలను ఆయన సీఎం అయిన తర్వాత తీర్చారన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా గుర్తింపు పొందారన్నారు. ఈ యాత్రే మన రాష్ట్రంలో నేడు కొనసాగుతున్న సుపరిపాలనకు నాంది పలికిందన్నారు.

–సాక్షి నెట్‌వర్క్‌.



మెంటాడ: పోరాంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పక్కనే జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు



బొబ్బిలి పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రాజాంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రామభద్రపురం: ఆరికతోటలో కేక్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



తెర్లాం: మండల కేంద్రంలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు



రామభద్రపురం: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



రాజాం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని సురవరం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన మేలును వివరించారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గ్రామసచివాలయ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారని, దీంతో ప్రజల వద్దకే పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు, సేవలు అందుతున్నాయన్నారు. ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేసి, గ్రామీణులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్పతనం కూడా ఆయనదేనన్నారు.



సురవరంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ జి.షణ్ముఖ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పుల్లిట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొనే ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు వాటిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే అది ఎందుకు పరిష్కారం కాలేదో సంబంధిత వ్యక్తికి తెలియజేయాలన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దారు రఫీజాన్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు పాల్గొని, వివిధ సమస్యల పరిష్కారానికి పలువురు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారమై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ప్రభుత్వ పథకాలతో.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఆరికతోట గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలతో పాటు జగన్నాథపురంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే ఆయన తపన అని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ వర్గంలోని ప్రజలకు మంచి జరిగేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. నియోజకవర్గంలో గత 15 ఏళ్లలో ఎప్పుడూ.. ఎక్కడా జరగని అభివృద్ధి ఇప్పుడు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలను గుర్తించి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సహకారంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. అక్రమ మార్గంలో మంత్రి పదవి



ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పొందిన వారు వారి ఆస్తులను ఎలా కాపాడుకోవాలి.. ఆస్తులు ఎలా కూడబెట్టుకోవాలో ఆలోచించారే తప్ప నియోజకవర్గంలో కనీస అభివృద్ధి కోసం ఆలోచించలేదని బొబ్బిలి రాజులను ఉద్దేశించి, విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు కాని రాజులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే 2024 ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల పార్టీ కన్వీనర్ అప్పికొండ లక్ష్మినాయుడు, వైస్ ఎంపీపీ పెంకి అరుణ, సర్పంచ్ పెంకి పుష్పమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు మీసాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా దివ్యాంగులకు ఉపకరణాలు సోమవారం పంపిణీ చేశారు. ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు 9, ట్రై సైకిళ్లు 6, ఫోల్డింగ్ టూ వీల్స్ 11, హియరింగ్ మిషన్లు 6, ఊత కర్రలు 6 అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.మంజుల, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోండి

సంతకవిటి: ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు మండల వ్యవసాయాధికారి నవీన్‌కు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎస్.మంజుల అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో పాల్గొన్న ఆయన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల జీవితాలు బాగున్నాయన్నారు. గతంలో రైతులు పడిన ఇబ్బందులు రూపుమాపేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, సకాలంలో విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు, సూచనలు అందేలా చేశారన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు రుణాలు

రేగిడి: మండలంలో అర్హులైన కౌలురైతులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని ఉంగరాడమెట్ట ఏపీజీవీబీ, ఉనుకూరు ఏపీజీవీబీ, దేవుదళ ఎస్‌బీఐ, రేగిడి యూనియన్ బ్యాంకు మేనేజర్లను ఆయన కలసి కౌలురైతుల జాబితాను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా సీసీఆర్‌సీ కార్డులు అందించిన రైతులందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు. మండలంలో మొత్తం 160 మంది రైతులు రుణాలు పొందేందుకు అర్హులన్నారు. రుణాలు ఇచ్చి, రైతులను ప్రోత్సహించాలన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

బొబ్బిలి: స్థానిక కోర్టు భవనంలో బొబ్బిలి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ సోమవారం సమావేశమయ్యారు. వచ్చే నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి కోరారు. అనంతరం లోక్‌అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎం.సరోజనమ్మ, జె.సౌమ్యా జోసెఫిన్, డీఎస్పీ పుల్లారు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు భద్రత

రాజాం సిటీ/వంగర/బొబ్బిలి: మండలాల్లోని పలు ప్రాంతాల్లో దిశ యాప్‌పై సోమవారం అవగాహన కల్పించారు. రాజాం పట్టణంలోని పలు కూడళ్లలో టౌన్ సీఐ కె.రవికుమార్ విద్యార్థులకు, ప్రయాణికులకు యాప్ డౌన్‌లోడ్, వినియోగం, ఉపయోగాలను వివరించారు. వంగర మండలంలోని అరసాడ, వంగర, మద్దువలస ప్రాంతాల్లో వాహనదారులకు దిశ యాప్ ఉపయోగాలను పోలీసులు వివరించారు. బొబ్బిలి పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థినులకు దిశ యాప్ ప్రయోజనాలను ఏఎస్‌ఐ జి.భాస్కరరావు వివరించారు. దిశ యాప్‌తో మహిళలకు భద్రత అని, ప్రతిఒక్కరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

బాడంగి: ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ఫండ్ ఇండియా మండల లింక్ వర్కర్ చింతాడ నిర్మల కోరారు. మండలంలోని గొల్లాది గ్రామంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ చేపట్టారు. లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, తల్లిపాల ద్వారా వ్యాధి సోకే అవకాశం ఉందని తెలిపారు.

విశ్వసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అన్నారు.

చురుగ్గా భూముల రీసర్వే

బాడంగి: మండలంలో భూముల రీసర్వే చాలా చురుగ్గా జరుగుతోందని తహసీల్దారు అజురఫీజాన్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పాల్తేరు, పూడివలస గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. తొలి విడతలో 21 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు.

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో భూముల రీసర్వే సోమవారం ప్రారంభించారు. సర్వే సమయంలో రైతులు సిబ్బందికి అందుబాటులో ఉండాలని డీటీ జి.అప్పయ్య తెలిపారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ శిబిరానికి హాజరైన రోగులకు తనిఖీలు చేసి, మందులు అందజేశారు.

'జగనన్నకు చెబుదాం'

బొబ్బిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించి, ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఎంపీడీవో పి.రవికుమార్ స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి



బస్సుయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహణపై పార్టీ నేతలను దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు పక్కనే డిప్యూటీ సీఎం రాజన్నదొర

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెంటాడ: సాలూరులోని బోసుబొమ్మ కూడలి వద్ద ఈ నెల 8వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. సోమవారం మండలంలోని పోరాం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమం ఇప్పుడు రాష్ట్రంలో చూస్తున్నామని, దానికి కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే ఆయన తపన అని అన్నారు. ప్రతీ ప్రాంతం అభివృద్ధికి పాటుపడుతున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. పేదవాడి తలరాతను మార్చిన ఘనత ఆయనదేనన్నారు. ఈ విషయాలన్నీ బస్సుయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులపై ఉందన్నారు. ఇక్కడి నుంచి ప్రారంభమయ్యే బస్సుయాత్ర రోజు ఇక్కడి నుంచే 300 ద్విచక్ర వాహనాలతో సాలూరు వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. అనంతరం ఆయా కార్యక్రమాలకు సంబంధించి, చేయాల్సిన ఏర్పాట్లపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు సలహాలు, సూచనలు చేశారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలన్నారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బస్సుయాత్ర ఇన్‌చార్జ్ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల చైర్మన్ నారాయణమూర్తి, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- పాఠశాల భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలస గిరిజన గామంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతిలతో కలిసి నాడు–నేడు పథకం ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ప్రతీ పేద పిల్లవాడు ఉన్నత స్థాయి విద్యనభ్యసించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఆయన కల్పిస్తున్నారన్నారు. ప్రధానంగా నాడు నేడు పథకం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. గతంలో అరకొర వసతులతో భవనాలు ఎప్పుడు పడిపోతాయోనన్నట్లుగా ఉండేవన్నారు. ఇలాంటి భవనాల్లో చదువుకోవాలంటేనే విద్యార్థులు భయపడేవారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో ఎక్కడ ఏ ప్రభుత్వ పాఠశాలను చూసినా ఇప్పుడే



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

కట్టినట్లు కొత్తగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇదిలా ఉండగా, పేదరికం కారణంగా విద్యార్థుల చదువు ఆగిపోకూడదని, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన పథకాలతో ఆర్థికసాయం చేస్తున్నారన్నారు. జగనన్న విద్యాకానుక పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అందజేశారన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయ సిబ్బందితో ఉత్తమ విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రావివలస సర్పంచ్ ఎస్.కుమారి, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా రూ.22 లక్షలతో నిర్మించిన ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. గతంలో అనారోగ్యం పాలైనపుడు వైద్యం కోసం మండల కేంద్రానికి ప్రజలు పరుగులు తీయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామాల్లోనే వైద్యారోగ్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఒకప్పుడు మండలానికి ఒకటో.. రెండో ఆరోగ్య కేంద్రాలు ఉండేవని, అందులో కూడా పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండేవారు కాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలతో ఆస్పత్రులను నిర్మించడమే



విలేజ్ హెల్త్ క్లినిక్ భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

కాకుండా, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ జి.షణ్ముఖరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.